# సీ, ఏమి పరీక్షలు!

పీడా వదిలింది. 15 సంవత్సరాల శని నేటితో విరగడయింది. అబ్బా, ఈ పరీక్షలకోసం బుద్ధిని ఎంత సంకుచితం చేసుకోవాలి! మాడ్రిడ్ ఏమయినా, మన పది మార్కులూ మనం దేవుకుంటే చాలు. సుభాస్‌బాబు ఆరోగ్యం ఎల్లా వున్నా మన పది మార్కులూ మనం దేవుకుంటే చాలు. కాంగ్రెస్ సభాధ్యక్షుడు వల్లభాయి అయినా, రాజగోపాలాచారి అయినా, గఫ్ఫార్‌ఖాన్ అయినా ఒక్కటే మనకు! సుభాస్‌బాబు ఇంతవరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఎందుకు కాలేదో, మిగతా నాయకులు మాత్రం తిరగబడి, బోర్లబడి, ప్రక్కకుపడి, ఒక్కొక్కరూ రెండు మూడుసార్లు ఎందుకు అవుతున్నారో మనం ఆలోచించం. అంతవరదాకా ఎందుకు? ఆరోజుల్లో బెర్నార్డుషా చదువుకునే అవకాశంగానీ, భార్యకు ఉత్తరం రాసుకునే ప్రాప్తంగానీ ఉండదు. ఏం పరీక్షలు! పక్షినై పుట్టినా ఈ పరీక్షలు తప్పేవి; హాయిగా పల్టీలు కొడుతూ ఆకాశాన విహరించే పని. ఆఖరికి కోతినై పుట్టినా ఈ పరీక్షలు తప్పేవి. కిచకిచమంటూ చెట్లమీద గంతులువేస్తూ తిరిగేపని. ఈ పాడుపరీక్షలు ప్యాసయి ఉద్యోగం చేసేదానికన్నా ఏ పరీక్షలూ లేకుండా, యమధర్మరాజుక్రింద దున్నపోతుపని చెయ్యటం మంచిది.

* * *

ఏం పరీక్షలు! ఏం పరీక్షలు! క్లాసుపుస్తకాలు ముక్కున
పెట్టుకొని నూటికి ముప్పైమూడ్లు గిల్లుకొంటానికేనా నేను
పుట్టింది! ఏ గుమాస్తా గిరిలోనో జేరి, ఉదరం సవరించుకో
టానికేనా నేను పుట్టింది! హాతవిధీ! ఈ బోడి డిగ్రీలకోసం
దేవులాడకపోతే, ఈపాటికి యెన్ని ఉత్తమ గ్రంథాలు తిరగ
వేసేవాణ్ణో! అబ్బా! శక్తిని సద్వినియోగం చెయ్యటానికి
యీ పరీక్షలు ఎంత ఆటంకం? వీటివల్ల ఎంతమందిజ్ఞానం
డిప్పలలోని వేరుసెనగ పప్పులాగ, బురఖాలోని స్త్రీలాగ,
లోకాన్నుంచి కప్పివేయబడుతోందో! ఎవరిదాకో ఎందుకు?
అమృతమే లేని యీ రాహువునోట్లో చిక్కి నేను నా కాంతిని
ఎంత కోల్పోయానో? ఊహవచ్చిందగ్గరనుంచీ పరీక్షలకు
చదవటం, పరీక్షలు ప్యాసవటం (ప్యాసయినందుకు ఘన
కార్యం చేసినట్లు కులకటం) తప్ప యింకొకపని లేదుగదా!
ఇటువంటి వెంగళాయిలు దేశానికి ఎందుకు పనికివస్తారు?
మాతృదేశోద్ధరణకు పనికివచ్చే శక్తినీ, బుద్ధిబలాన్నీ లాగి
వెయ్యటమే యీ విద్యయొక్క ముఖ్యోద్దేశం. అందుకనే
మెకాలే ప్రభువు — (?) — "ఈ విద్యావిధానం ముప్పై
సంవత్సరాలు సాగితే హిందూదేశం తారుమారవుతుంద"
న్నాడు.

* * * *

ఎంత ఘోరం! స్వార్థపరులు ఎంతపనైనా చేస్తారు.
మతం పేరుతో, అందులో ఏసుక్రీస్తు పేరుతో, ఏపనిచేసినా
ముక్తిదాయకమే అవుతుంది. ఏసుక్రీస్తు మానవ సౌభ్రాతృ
త్వాన్ని బోధించాడు. అటువంటి మతాన్ని మానవ నాశ

నానికి ఉపయోగించుకుంటోంది అతని భక్తబృందం. ఏధర్మ మయినా యింతే! అందుకనే మిల్టన్—జ్ఞాపకం రావటం లేదు—ఈ నిరర్థకపు పరీక్షలకు చదివే చదువు యిల్లాగే ఉంటుంది ... ఏదీ ... అవును.

> ''......So little knows
> Any but God alone to value right
> The good before him but perverts best things
> To worst abuse or to their meanest use''

అన్నాడు.

అర్థం చేసుకునేవాళ్ళ హృదయాలకు అనుకూలమైన రూపం తాలుస్తుంది ఏ ధర్మమయినా ... సంఘ శ్రేయస్సు కోసం సృష్టించబడిన వర్ణాశ్రమ ధర్మం నేడు సంఘాన్ని చిందరవందర చెయ్యడానికి ఉపయోగపడుతోంది. అదే విధంగా క్రైస్తవమతం అవసానదశలో హిందువులను బాని సలను చెయ్యటానికి పనికివస్తోంది. ఆంగ్లేయులకు మనలను ఆ మతంలోకి తోలటానికి (అంతవరదాకా కాకపోయినా, మన మతం మరచిపోవటానికి) ఉపయోగిస్తుం దీ చదువు. మన జనం యీ సంగతి ఆలోచించదు. ఈ విద్య అభ్యసించ వలసిందే! ఈ జీవితం విద్యాలయాలకు అర్పించవలసిందే! యువకులంతా తలగుడ్డలు ధరించి గుమస్తాలుగా తయారయి, మొహాలు వేలవేసుకొని, అడ్డమయినవారికి జోహారులు చెయ్యవలసిందే! ఆర్యావర్తం కర్మభూమి ... కాబట్టి దేవుడే వీళ్ళని "మీరు భారతదేశంలో (ఈ రకానికి యింతకంటే మంచి దేశం దొరకదు) గుమాస్తాలుగా పుట్టండర్రా" అని ఆజ్ఞాపించి పంపించాడేమో! కాని ఒక్క మనదేశాన్నే

నిందించుకోవలసిన పనిలేదు. అసలు కాలేజీ విద్యావిధానం లోనే ఉంది యీ దాస్యగుణం. చూడు!...జీవిత సమస్యలను ఉచ్చంగా పుస్తకాలద్వారా కాక ముఖాముఖిని చూడగలవారే ప్రముఖులవుతున్నారు. మూర్డ్‌నాల్డు వార్తాపత్రికలను అమ్ముకోకపోతే అంత గొప్పవాడయ్యేవాడు కాడు. అయిదోజార్జి సార్వభౌముడు నావికులలో కలిసి తిరగకపోతే తన తండ్రిలాగే తయారయ్యేవాడు. స్టాలిన్ ఎన్ని పరీక్షలు ప్యాసయ్యాడు? బెర్నార్డుషా నిక్కుతాడుగాని ఏ ఏ కాలేజీల్లో చదివాడు? ఎటుచూచినా కాలేజీ చదువు లేనివారే ప్రపంచాన్ని కేలెత్తి నడిపిస్తున్నారు. వీరంతరూ గ్రంథాలయాల్లో పీఠం వెయ్యక డిగ్రీలకోసం కాలేజీల్లో మురిగితే ఎవ్వరికన్నా గొప్పవారయ్యేవారు?

* * *

పాపిష్టి జన్మ! కడుపే కైలాసంగా నిర్మించుకోటాని కేనా నేను జన్మించింది? నాలుగు కాలాలపాటు – బహుశా పువ్వులతో, కాయలతో–ఈ ప్రపంచంలో బ్రతకటాని కేనా నేను జన్మించింది? బుద్ధిబలాన్ని దేశక్షేమానికీ, మానవ శ్రేయస్సుకీ వినియోగించవలసిన బాధ్యత లేదా? అవును, ఎట్లా వుంటుంది? ప్రపంచమంతా పరీక్షల మయమయి పోయింది? డిగ్రీలు సంపాదించలేనివాడు మూఢుడు; ఏ ఉద్యోగానికీ అతడు పనికిరాడు; ఎంత జ్ఞానం సంపాదించినా సరే, ఎన్ని ఉన్నత గ్రంథాలు క్షుణ్ణం చేసినాసరే! "దాశరథీ కరుణాపయోనిధీ" అనీ, "Jack and jill went up the hill" అనీ దుబ్బుడు మొదలుపెట్టకపోతే ఈ దేశంలో చోటు

లేదు. ఏమి నాగరికత! ఏమి అభివృద్ధి! ఈ వెధవ చదువు వల్ల గుమాస్తా మయమయిందీ ప్రపంచం. యీ గుమాస్తా బాబులు దేశానికి ఎందుకు పనికివస్తారు? మన దేశోద్ధరణకు ఈ విద్యావిధానాన్ని మార్చటానికి ఎందుకు ప్రయత్నించరు? రష్యాలో టాల్‌స్టాయ్ స్థాపించటానికి ప్రయత్నించిన విధానాన్ని మనదేశంలో ఎందుకు అమల్లోపెట్టరు? మొన్న జవహర్‌లాల్ నెహ్రూ ఏమని చెప్పాడు? "ప్రపంచం విషమ పరిస్థితుల్లో ఉంది. విశ్వవిద్యాలయాలు యువకులను ఈ సమస్యలు ఎదుర్కోటానికి తయారుచెయ్యాలి" అనలేదా? ఈ మాటలు దేశోద్ధారకులు వినిపించుకోరెందుకని? ఈ గుమాస్తాలను అడ్డంపెట్టుకొని స్వరాజ్యం సంపాదించగలమనేనా? ఏమైనా ఈ విద్యాలయాలు దేశానికి చేస్తూన్న అపకారం భాయి పరమానంద్, జిన్నాలుకూడా చెయ్యటం లేదు. ఈ కళాశాలలు (శిశాశాలలుకాదు, నేతిబీరకాయలు) నేలమట్టమయినప్పుడే స్వరాజ్యం వచ్చేది. అందుకనే షా, విద్యార్థులకు "క్లాసు పుస్తకాలు చదవకండి. నిజమైన గ్రంథాలు, (తన గ్రంథాలవంటివని ఉద్దేశం) చదవండి. లేకపోతే మీకూ, మిమ్మల్ని భరిస్తున్న దేశానికీ అరిష్టం కలుగుతుంది" అని చెప్పాడు. ఆమధ్య పి. సి. రే కూడా ఇటువంటి మాటే అన్నాడు. ఇది చదివి మొదట బూజుగడ్డాల బూచులు గీర్వాణం పోతున్నాయనుకున్నాను. ఎంత నిజం! 15 సంవత్సరాలు ఎడారిలోని తుమ్మెదవలె తన్నుకుంటేగాని దాని యదార్థం బోధపడలేదు. వెధవ పరీక్షలు! ముష్టి పరీక్షలు! పోనీ, ఈ జన్మకిక పరీక్షల్లేవు. షేక్స్పియరు చేత

సృష్టించబడ్డ ఏరియల్, ప్రాస్పిరో ప్రాపకంవల్ల స్వాతంత్ర్యం సంపాదించి, ఏమన్నాడు ?

"Where the bee sucks there suck I
In a cowslip's bell I lie
There I couch where owls do cry
On the bat's back I do fly."

ఆహా, స్వాతంత్ర్యం! ఇక నన్నుగురించి నా స్నేహితులు జాలితలచ నవసరంలేదు. ఇక నేను నా జ్ఞానాన్ని అరికట్టుకో వలసిన అవసరంలేదు. ఇక నన్ను చూచుకొని నేను జాలి తలచుకోనవసరంలేదు. ఈ క్షణంనుంచే నా జీవితానికి పునాదులు వేస్తాను. ఏమి చెయ్యాలి ? ఏమీ తోచటంలేదే ! అయ్యో ! ఎటుచూచినా ఉద్యోగాలే కనిపిస్తున్నాయి. ఈ చదువు సైతాను బుర్రను ప్రవేశపెట్టింది నాలోకి. ఎటు చూచినా సైతానుకి నరకమే కనుపించేది ! ఎటుచూచినా నాకు ఉద్యోగాలే కనిపిస్తున్నాయి. ఒకవేళ నే నే ఒక పెద్ద ఉద్యోగాన్నేమో !

ఘోరం ! ఘోరం ! నా మెదడు పేలిపోతోంది. నా హృదయం హంపీక్షేత్రమయిపోతోంది. ఈ ఉద్యోగాల భయంకర దృష్టినుంచి తప్పించుకోలేను ? ఈ ప్రపంచంలో నుంచి పారిపోతాను. నా సొంత ప్రపంచాన్ని ఒకదాన్ని నిర్మించుకుంటాను. దానికి కావలసిన వస్తుసామాగ్రినంతా ప్రపంచాన్నుంచి వెల్లించి, బెదిరించి సేకరిస్తాను.

అబ్బా 15 సంవత్సరాలు దుర్వినియోగం చేశాను.

ఎంత కసిగా ఉంది ! ! !

1930 లో వ్రాసింది.